
సాక్షి
కర్నూలు
మంగళవారం । 11 । జూన్ । 2024



మల్లన్నకు సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ చేశారు.



శ్రీగిరికి దాతల విరాళం

శ్రీశైలం టెంపుల్: గో సంరక్షణ నిధికి నెల్లూరుకు చెందిన భువనేశ్వర్‌రెడ్డి రూ.1,50,000, అన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన నాగేశ్వరరావు రూ.1,01,116 విరాళం అందజేశారు.



టీబీ డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో


హొళగుంద: తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో పెరిగింది. ఆదివారం ఇన్‌ఫ్లో 2,750 క్యూసెక్కులు ఉండగా సోమవారం 4,817 క్యూసెక్కులకు పెరిగి నీటి నిల్వ 5 టీఎంసీలకు చేరింది.

ఫీజుల భారం మొదలాయె!

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువు 'కొనాల్సి' వస్తోంది. నర్సరీ కోసం ఒక్కో విద్యార్థికి కనీసం రూ.25 వేల నుంచి రూ.45 వేల వరకు ఖర్చవుతోంది. ఆపై తరగతుల ఖర్చు మరింత పెరుగుతోంది. దీంతో ప్రాథమిక విద్య సామాన్యులకు భారమవుతోంది. పాఠశాలల్లో ఫీజులు, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, యూనిఫాం తదితర ఖర్చుల కోసం ఒక్కో ఇంటికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అవసరం ఉంటోంది. అందుకే జూన్ నెల వచ్చిందంటే చాలు.. సామాన్య, మధ్య తరగతి ప్రజలు హడలిపోతున్నారు.

- ఈ ఏడాది ఫీజులు పెంచిన కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు
- 25 శాతం పెరిగిన పుస్తకాల ధరలు
- 13న పునఃప్రారంభం కానున్న స్కూళ్లు
- జూన్ నెలలో తల్లిదండ్రులపై రూ. వంద కోట్లకు పైగా అదనపు భారం





కర్నూలు (సిటీ): పాఠశాలలు గురువారం పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యం ఫీజుల పేరిట అడ్డగోలు దోపిడీకి తెరలేపాయి. డబ్బే ధ్యేయంగా తల్లిదండ్రులను పీల్చిపిప్పి చేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని స్కూళ్లు ఫస్ట్ టర్మ్ ఫీజులు వసూలు చేయగా, మరికొన్ని స్కూళ్ల టెక్నో, ఐఐటీ, ఒలింపియాడ్ అంటూ ఎక్కువ ఫీజులు తీసుకుంటున్నాయి. ఏటేటా విద్యా ఖర్చు మోతెక్కిపోతుంది. ఫీజులతోపాటు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, బుక్స్‌బ్యాగ్, క్యారేజీ బ్యాగ్, బూట్లు, యూనిఫామ్, బస్సు రవాణాకు చెల్లించాల్సిన సొమ్ము అదనం. ఈ ఏడాది కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులు 10 నుంచి 20 శాతం వరకు పెంచేశారు. అదే విధంగా పాఠ్యపుస్తకాల ధరలు సైతం 20 నుంచి 25 శాతం పెరిగాయి. విద్యా సంస్థల బస్సుల ఫీజులు సైతం గతేడాది కంటే ఈ ఏడాది రూ.500 వరకు పెంచారు.


ఓ కార్పొరేట్ స్కూల్‌లో విక్రయించేందుకు సిద్ధం చేసిన పుస్తకాలు

25 శాతం పెరుగుదల...

గత ఏడాది రూ.70 ఉన్న నోటు పుస్తకం ధర ఈ ఏడాది రూ.85 పైమాటే. గత ఏడాది ఆరో తరగతి విద్యార్థులకు సరాసరిగా రూ.7,500 వరకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలకు ఖర్చయ్యేది. ఇప్పుడు పెరిగిన ధరతో రూ.9,450 పైమాటే. ఇది ఒక్క నోటు పుస్తకాలకే. ఇంకా పెన్నులు, పెన్సిళ్లు, ఇతరత్రా వస్తువుల కొనుగోలు అదనం. వీటికి స్కూల్ బ్యాగ్, బూట్లు, యూనిఫాం, టై అదనపు భారం అవుతుంది. గతేడాది కంటే ఒక్కో విద్యార్థిపై సరాసరిగా రూ.2,500 అదనపు ఖర్చు పెరిగి, సుమారుగా రూ.36 కోట్లు భారం అవుతోంది.

ట్రాన్స్‌పోర్టు చార్జీలు...



విద్యార్థుల రవాణాకు సంబంధించి చార్జీలు కూడా పెరగనున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని చెబుతూ ప్రైవేటు విద్యాసంస్థలు బస్ చార్జీలను పెంచుతున్నాయి. ఇదే అదునుగా విద్యార్థులను తరలించే ఆటోలు, నాలుగు చక్రాల వాహనాల చార్జీలు సైతం పెంచేశారు. గత ఏడాది ఐదు కిలోమీటర్ల దూరానికి నెలకు రూ.1000 తీసుకునేవారు. ఈ ఏడాది రూ.1,250 వరకు తీసుకోవడానికి సిద్ధపడుతున్నారు.

ఫీ'జులుం'..

జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు 738 ఉన్నాయి. ఈ స్కూళ్లలో 1.45 లక్షల మంది విద్యార్థులు(ఫస్ట్ క్లాసు మినహా)ఉంటారు. సర్కారు బడుల్లో చక్కని చదువు దొరుకుతున్నా విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల వలకి చిక్కి చదువులకు రూ. లక్షల్లో అప్పులు చేసేస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులను పెంచేస్తున్నాయి. గతేడాది 1వ తరగతి విద్యార్థికి ఫీజు సరాసరి రూ.30 వేలు ఉండగా ఈ ఏడాది రూ.36 వేలు వసూలు చేయాలని కార్పొరేట్, సెమీ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు నిర్ణయించాయి. సరాసరిగా తరగతి వారిగా రూ.3,000 నుంచి 5,500 వేల వరకు ఫీజులు పెంచారు. కార్పొరేట్ సంస్థలను చూసి సెమీ కార్పొరేట్, కొన్ని ప్రైవేటు పాఠశాలలు సైతం ఫీజులను పెంచేస్తున్నాయి. ముందస్తుగానే ఫీజు కట్టించుకుంటున్నారు. అడ్మిషన్లు రాయించుకోవాలని ఒత్తిడి చేసి పాఠశాలలు పునఃప్రారంభం కాకముందే యాజమాన్యాలు తల్లిదండ్రులకు ఫోన్లు చేసి ఫీజులకు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం తీసుకోవాలని, లేకపోతే మీ పిల్లల టీసీలు తీసుకుపొండి అంటూ ఒత్తిళ్లు చేస్తున్నాయి. దీంతో ఆందోళనకు గురవుతున్న తల్లిదండ్రులు ఫీజు కట్టి అడ్మిషన్ రాయించుకుంటున్నారు. ఈ ఏడాది పెరిగిన ఫీజులతో తల్లిదండ్రులపై సుమారుగా రూ. 60 కోట్లు అదనపు భారం అవుతుంది. యూనిఫామ్స్, బుక్స్, నోట్ పుస్తకాలకు ఇబ్బడిముబ్బడిగా బిల్లులు వేస్తూ.. ఇవన్నీ తమ వద్దనే కొనాలని హుకుం జారీ చేస్తున్నాయి. చాలావరకు కార్పొరేట్ స్కూళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలను కాకుండా వారు రూపొందించిన పాఠ్యపుస్తకాల ద్వారా బోధన చేస్తున్నారు.

ఫీజులు ఏటా పెరుగుతున్నాయి



నేను వ్యవసాయంపై ఆధారపడి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. మాకు ఇద్దరు పిల్లలు. ఆలూరులోని ఓ ప్రైవేటు స్కూల్లో చదువుతున్నారు. స్కూల్‌లో ఫీజులు, పుస్తకాలు, నోటు బుక్స్ ధరలు ఏటా పెరుగుతున్నాయి. జూన్ నెల వచ్చిందంటే పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. మాలాగా మా పిల్లలు ఉండకూడదనే రాత్రి, పగలు పని చేసి వారి భవిష్యత్తు కోసం ఫీజుల భారం అధికమైనా చదివించుకుంటున్నాం. – ఉరుకుంద, మొలగవల్లి గ్రామం

సామాన్యులకు భారం



ప్రతి రోజు కూలీ పనులకు వెళ్తున్నా. వచ్చిన డబ్బులు కుటుంబ పోషణకు సరిపోవడం లేదు. మాకు ఇద్దరు పిల్లలు. హాలహర్విలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్నారు. స్కూళ్లకు సెలవులు ముగిసి తిరిగి ప్రారంభం అవుతున్నాయంటే ఫీజులు, యూనిఫాం తదితర వాటి కోసం వేలాది రూపాయలను ముందుగాను జమ చేసుకోవాల్సి వస్తుంది. పిల్లలకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో భారమైనా కూడా చదివించుకుంటున్నాం.

– రామయ్య, నిట్రవట్టి గ్రామం

న్యూస్‌రీల్

శ్రీగిరి.. భక్తజన సంద్రం



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహా క్షేత్రం భక్త జన సంద్రంగా మారింది. భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. పరమేశ్వరుడికి ప్రీతికరమైన సోమవారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకుని తెల్లవారు జామున పాతాళ గంగలో పుణ్య స్నానాలు ఆచరించి మల్లన్న దర్శనానికి బారులు తీరారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లు నిండిపోయాయి. స్వామి వారి సర్వ దర్శనానికి 4 గంటలు, శీఘ్ర దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. క్యూ లైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన సిబ్బంది తాగునీరు, అల్పాహారం, బిస్కెట్స్ పంపిణీ చేశారు. పలువురు భక్తులు మల్లన్నకు రుద్రాభిషేకం, అమ్మ వారికి కుంకుమార్చన నిర్వహించుకున్నారు.

శారీరక వికలాంగుల హాస్టల్ ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు(అర్బన్): నగరంలోని సి.క్యాంప్‌లో ఉన్న ప్రభుత్వ శారీరక వికలాంగుల వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్‌ఫాతిమా కోరారు. 2024–25 విద్యా సంవత్సరానికి 100 మంది విద్యార్థులకు వసతి కల్పించనున్నట్లు సోమవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ తదితర కోర్సులు చదువుతున్న శారీరక వికలాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన శారీరక వికలాంగులైన విద్యార్థులు తమ దరఖాస్తులను వసతి గృహ సంరక్షకునికి అందజేయాలన్నారు. ప్రవేశం పొందిన వారికి ఉచిత భోజన, వసతితో పాటు పుస్తకాలు, దుస్తులు, కాస్మోటిక్ చార్జీలు తదితర సదుపాయాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 8639152178, 08518–277864 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

'విద్యా కానుక' ఇప్పట్లో లేనట్లే!

కర్నూలు సిటీ: ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు విద్యా కానుక పేరుతో కిట్లు ఇవ్వాల్సి ఉంది. పాఠశాలల పునఃప్రారంభం రోజు నుంచే కిట్ల పంపిణీ ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. అయితే ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలిచింది. రెండు రోజుల్లో కొత్త ప్రభుత్వం కొలువు తీరనుంది. దీంతో ఆ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందోననే ఉద్దేశంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు విద్యా కానుక కిట్ల పంపిణీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. వేసవి సెలవులు ముగిసి ఈ నెల 12వ తేదిన పాఠశాలలు పునఃప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఆ రోజు కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయనుండడంతో 13న పునఃప్రారంభ తేదీగా మార్పు చేశారు. మొదటి రోజున కేవలం పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు మాత్రమే ఇచ్చే అవకాశం ఉన్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఎన్ని స్కూళ్లలో ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయనే విషయంపై స్పష్టత లేదు. విద్యా కానుకల కిట్లలో ఇచ్చే యూనిఫాం, బూట్లు, సాక్సులు, ఇంగ్లిష్, పిక్టోరియల్ డిక్షనరీలు, బ్యాగ్‌లు అయితే ఇంత వరకు జిల్లాకు రాలేదని తెలుస్తోంది. దీని బట్టి చూస్తే ఈ ఏడాది విద్యా కానుక కిట్లు ఇప్పట్లో ఇచ్చే పరిస్థితులు అగుపించడం లేదు.

జెడ్పీ సమావేశానికి సమాయత్తం

- ఈ నెల 19న నిర్వహించేందుకు ఏర్పాట్లు
- వ్యవసాయం, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలపై సమీక్ష

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో ... ఈ నెల 12వ తేదిన నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేస్తుండడం, ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొత్తగా ఎన్నికైన శాసనసభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ఉండడం వల్ల జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహణకు సంబంధించి సమయం తక్కువగా ఉన్నందున అధికారులు కొంత తర్జనభర్జన పడుతున్నారు. ఇప్పటి వరకు ఈ సర్వసభ్య సమావేశాలకు నియమ నిబంధనల మేరకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధులను ఆహ్వానిస్తు వస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారిన నేపథ్యంలో ... ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలలో టీడీపీ ఎంపీలు విజయం సాధించారు. అలాగే 14 అసెంబ్లీ నియోకవర్గాల్లో 12 మంది టీడీపీ, ఇద్దరు వైఎస్సార్‌సీపీకి చెందిన శాసనసభ్యులు ఎన్నికయ్యారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైన దృష్ట్యా మంత్రివర్గంలో ఎవరికి స్థానం దక్కుతుందో, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఎవరిని నియమిస్తారో అనే విషయంలో అధికారికంగా స్పష్టత వచ్చేందుకు మరో వారం రోజులు సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. జరుగుతున్న ప్రచారం మేరకు జిల్లాకు ఒకరు ప్రకారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇద్దరికి మంత్రి పదవులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. పీఆర్ చట్టం నియమ నిబంధనల మేరకు నేటి నుంచి ఎనిమిది రోజుల్లో జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంది. వారం రోజుల్లోగా రాష్ట్రంలో మంత్రివర్గం కూర్పు పూర్తి అయితే, ఆఘమేఘాల మీద జిల్లాకు చెందిన మంత్రులను జెడ్పీ సమావేశానికి ఆహ్వానించాల్సి ఉంటుంది.

మూడు శాఖలపై సమీక్ష ...

అజెండాలో మూడు ప్రభుత్వ శాఖలపై సమీక్షించేందుకు నిర్ణయించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రధానంగా వ్యవసాయం, నీటి పారుదలతో పాటు గ్రామీణ నీటి సరఫరా శాఖలపై చర్చించనున్నారు. అధ్యక్షుల అనుమతితో ఇతర అంశాలను కూడా చర్చించేందుకు అవకాశం ఉంటుంది.


జిల్లా పరిషత్ కార్యాలయం

12లోగా అభివృద్ధి నివేదికలు పంపండి

ఈ నెల 19వ తేదిన జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరగనున్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి నివేదికలను ఈ నెల 12వ తేదీలోగా పంపించాలని జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి కోరారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులకు లేఖలు రాశారు. అలాగే ఈ సమావేశానికి జిల్లాలోని జెడ్పీటీసీ, ఎంపీపీ, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని కోరారు. – జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి

కొనసాగుతున్న వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. జూన్ నెలలో మొదటి 10 రోజుల్లోనే 83.2 మి.మీ వర్షపాతం నమోదు కావడం విశేషం. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు ఆయా మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. కోసిగిలో 24.8 మి.మీ, గోనెగండ్లలో 13.2, ఎమ్మిగనూరులో 11.8, కర్నూలు రూరల్‌లో 6.4, నందవరంలో 6.2, సీ.బెళగల్‌లో 6.0 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 83.2 మి.మీ వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 7 శాతం అధిక వర్షం కురిసింది. రానున్న రోజుల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఉదయం 8.30 నుంచే ఓపీ

కర్నూలు(హాస్పిటల్): పెద్దాసుపత్రిలో ప్రతి రోజూ ఉదయం 8.30 గంటల నుంచే ఓపీ టికెట్లు ఇవ్వాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన ఆసుపత్రిలోని ఓపీ కౌంటర్‌ను పరిశీలించారు. రోగుల రద్దీ దృష్ట్యా ఈ డిజిటల్ ఓపీ, ఇతర కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ డిజిటల్ కౌంటర్‌కు మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. త్వరలో మరో డిజిటల్ కౌంటర్ కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోగులకు ఓపీ టికెట్ త్వరగా ఇవ్వడం వల్ల వారికి మరింత త్వరగా వైద్యం అందుతుందన్నారు. అనంతరం ఆయన క్యాజువాలిటీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు కావాల్సిన సదుపాయాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయా అని సీఎంఓ ద్వారా అడిగి తెలుసుకున్నారు. క్యాజువాలిటీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. అక్కడ సక్షన్ మిషన్లు తక్కువగా ఉండటం గమనించి త్వరితగతిన వారికి రెండు మిషన్లు మంజూరు చేశారు. ఆయన వెంట ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత, ఏడీ రమేష్‌బాబు ఉన్నారు.


నర్సింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

సీఎం ప్రమాణ స్వీకారానికి నియోజకవర్గానికి నాలుగు బస్సులు


కర్నూలు(సెంట్రల్): అమరావతిలో జూన్ 12న జరిగే సీఎం చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు నియోజకవర్గానికి నాలుగు బస్సులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా బస్సుల ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం నుంచి 11న సాయంత్రం 6.30 గంటలకు నాలుగు బస్సులు బయలుదేరి 12న ఉదయం సీఎం ప్రమాణ స్వీకార స్థలానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కో బస్సులో 50 మంది వెళ్లేందుకు అనుమతించాలని, వారందరికీ సీఎం ప్రమాణ స్వీకారానికి సంబంధించి పాసులను జారీ చేయాలన్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల్లో ముందుగానే తెలియజేయాలని డీఆర్వో, జెడ్పీ సీఈఓలను ఆదేశించారు.

అరచేతిలో వాతావరణం

- ఫోన్‌లో ఈ యాప్స్ ఉంటే వర్షం రాక.. పిడుగు గుర్తింపు సులువు
- ప్రత్యేక యాప్‌లు రూపొందించిన కేంద్ర ప్రభుత్వం
- గ్రామ పంచాయతీ స్థాయిలో వాతావరణం అంచనా
- వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునే సౌలభ్యం
- వర్షం, పిడుగుల సమాచారం ఫోన్లకు పంపుతూ అప్రమత్తం చేస్తున్న వైనం
- వ్యవసాయ, అనుబంధ రంగాల యజమానులకు ప్రయోజనకరమంటున్న అధికారులు

వాన రాకడ.. ప్రాణం పోకడ.. ఎవరికి తెలుస్తుందనేది పాత నానుడి. నేడు శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాధించిన ప్రగతితో వర్షం రాకను ముందుగానే తెలుసుకుంటున్నారు. అదే సమాచారాన్ని మెసేజ్‌ల రూపంలో సెల్‌ఫోన్లకు పంపి మానవాళిని అప్రమత్తం చేస్తున్నారు. ఫలితంగా భారీ వర్షాలు, ఈదురు గాలులు, పిడుగుపాటు తదితర ప్రకృతి విపత్తుల నుంచి పూర్తిగా బయటపడలేకపోయినా నష్టం శాతాన్ని తగ్గించుకుంటున్నారు.





ఆళ్లగడ్డ: దేశ ఆర్థిక రంగానికి ప్రాణాధారం వ్యవసాయం, అనుబంధ రంగాలు. విత్తు నాటడం మొదలు తగిన ధరకు విక్రయించుకోవడం వరకు అడుగడునా సవాళ్లే. ఈ సమస్యల అగ్రస్థానంలో నిలిచేది వాతావరణం. అనూహ్యంగా మారిపోతూ రైతులకు ఇది అనుక్షణం సవాళ్లు విసురుతూ ఉంటోంది. వర్షాలు, ఈదురు గాలలు తీవ్ర ఆర్థిక నష్టానికి కారణమవుతుండగా పిడుగుపాటు ప్రమాదాలు రైతులు, వ్యవసాయ కూలీలు, గొర్రెలు, పశువుల కాపర్లు, ఆరుబయట ప్రాంతాల్లో తిరిగే వ్యవసాయ కూలీలను విగత జీవులుగా మారుస్తున్నాయి. పిడుగు పడితే విలువైన పశుసంపద, మహావృక్షాలు, మనుషులు, జంతువుల ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. పిడుగు పడే అవకాశం ముందస్తుగా తెలుసుకునే అవకాశం లేకపోవడంతో రక్షించుకునే అవకాశాలు లేక ప్రాణ, ఆస్తి నష్టాలు జరుగుతున్నాయి. అతివృష్టి కారణంగా పంటచేలు దెబ్బతిని రక్షించుకునే అవకాశాలు లేక నష్టం జరుగుతోంది. ఈ కాష్టాలకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెరదించింది. గ్రామ పంచాయతీ స్థాయిలోనే వాతావరణం అంచనాలు విడుదల చేస్తోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్, ఇంటర్ నెట్ సౌకర్యం ఉంటే వాతావరణం వివరాలు తెలుసుకుని అప్రమత్తమయ్యే వీలు కల్పిస్తోంది.

వారం ముందే 'మేఘదూత్'

పంట సాగులో విత్తనం నుంచి ఎరువులు వేసే సమయం, లేదా పంట నూర్పిడి సమయంలో రైతులను నష్టపరిచేది వర్షమే. ఇలాంటి నష్టాల నుంచి బయటపడేందుకు 'మేఘదూత్' యాప్‌కు పురుడు పోసింది. దీని సాయంతో వారం ముందుగా నాలుగు, ఐదు రోజుల వాతావరణ మార్పులు, వర్షసూచన సహా ఆకాశం మేఘావృతం అవుతుందా? లేదా.. గాలులు ఏదిశ నుంచి ఏ దిశకు వీస్తాయి? తేమ శాతం, ఉష్ణోగ్రత వివరాలను తెలుసుకునే అవకాశం ఉంది. ఈ యాప్ ద్వారా ప్రతి మంగళ, శుక్రవారాల్లో చారిత్రాత్మక వాతావరణ సమాచారంతో ఆగ్రో మెట్ ఫీల్డ్ యూనిట్లు (ఏఎమ్‌ఎఫ్‌యూ) రైతులకు మెసేజ్ రూపంలో పంపుతున్నాయి.

వర్షాన్ని గుర్తించేందుకు 'రెయిన్ ఈ అలారమ్'

గూగుల్ ప్లేస్టోర్ నుంచి రెయిన్ అలారం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వినియోగదారుడు అందించిన సమాచారం మేరకు అతను ఉండే ప్రాంతానికి సమీపంలోని 20 కి.మీ పరిధిలో ఎక్కడ వర్షం పడే సూచనలున్నాయో క్షణాల్లో తెలుసుకోవచ్చు. వర్షం ముప్పును గుర్తించి ముందే తెలుసుకుని జాగ్రత్త పడే అవకాశం ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.


మెరుపులను తెలిపే 'దామిని'

ఎప్పటికప్పుడు మెరుపు హెచ్చరికలను తెలియజేసేందుక 'దామిని' యాప్ ఉపయోగపడుతుంది. దీని సాయంతో సమీపంలో 20 కి.మీ పరిధిలో ఐదు నుంచి 20 నిమిషాల వ్యవధిలో ఎక్కడ పిడుగు పడే అవకాశం ఉందో అప్రమత్తం చేస్తుంది. మెరుపు ఎందుకు వస్తుంది. మెరుపు వచ్చినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలను ఈ యాప్‌లో వివరించారు. లొకేషన్ ఆధారంగా ఎక్కడెక్కడ మెరుపులు వచ్చే అవకాశముందో సూచిస్తుంది. పిడుగు పడినప్పుడు తోటివారికి అందించాల్సిన వైద్య సాయం, శ్వాస ఆగిపోతే నోటి నుంచి శ్వాసను అందించడం, గుండె చప్పుడు ఆగిపోతే సీపీఆర్ చేయడం తదితర వివరాలతో పాటు పిడుగు పడినప్పుడు ప్రాథమికంగా చేయకూడనివి, చేయాల్సిన పనులు ఇందులో తెలుసుకోవచ్చు.



దామిని యాప్

పిడుగు సమాచారానికి వజ్రపాత్



గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ గుర్తుపై నొక్కితే రెండు రకాల సమాచారం వస్తుంది. ఎడమ వైపు పిడుగు గుర్తు, పిడుగు సమాచారం కనిపిస్తుంది. అక్కడ నొక్కితే మనం ఉన్న ప్రాంతం సహా మ్యాప్ కనిపిస్తుంది. రెడ్, ఆరెంజ్, ఎల్లో కలర్‌లలో వలయాలు కనిపిస్తాయి. వీటి పక్కనే 8, 15, 30 అంకెలుంటాయి. ఈ అంకెల ప్రకారం అంటే కొద్ది సేపట్లో అంత దూరంలో (కి.మీలలో) పిడుగు పడే అవకాశం ఉందని చూపిస్తుంది. అలాంటిదేమీ లేకపోతే మీ సమీపంలో పిడుగు పడే అవకాశం లేదని సమాచారం కనిపిస్తుంది. ఎంత దూరంలో పడుతుందో పిన్ రూపంలో స్పష్టత ఇస్తుంది. యాప్ కుడి భాగంలో పిడుగు పాటు హెచ్చరికలు తెలిపే బటన్ ఉంటుంది. యాప్ ఆన్ చేసి ఎప్పుడికప్పుడు అప్రమత్తం కావొచ్చు.

అనేక ప్రయోజనాలు

వెదర్ యాప్ అందుబాటులోకి రావడంతో ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారాన్ని తెలుసుకునే వీలుంటుంది. రైతులకు వర్ష సూచన తెలియక విత్తనాలు వేసుకోవడం, పురుగు మందులు పిచికారీ చేసుకోవడం, రసాయనిక ఎరువులు వేసుకున్న సమయంలో తీవ్రంగా నష్టాల్లో కూరుకుపోవడం సాధారణంగా జరుగుతూ ఉంటుంది. ఈ వెదర్ యాప్‌తో ఎప్పుడు వర్షాలు వచ్చే సూచనలు ఉన్నాయో తెలుసుకోవచ్చు.

– రామ్మోహన్‌రెడ్డి, ఏడీఏ, ఆళ్లగడ్డ

క్లుప్తంగా

క్షతగాత్రులకు జెడ్పీ చైర్మన్ పరామర్శ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: టీడీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడి కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త హరికృష్ణ దంపతులను సోమవారం జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పరామర్శించారు. బెలుం శింగవరంలో ఈనెల 8న వైఎస్సార్‌సీపీ కార్యకర్త హరికృష్ణ ఇంట్లో ఉన్న సమయంలో టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. అడ్డువచ్చిన భార్య తిరుపతమ్మపై కూడా దాడి చేశారు. తీవ్రవగా గాయపడిన దంపతులు కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందడంతో జెడ్పీ చైర్మన్ అక్కడికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని హరికృష్ణ దంపతులకు భరోసా ఇచ్చారు. జెడ్పీ చైర్మన్ వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు లాయర్ మహేశ్వరరెడ్డి, పేరం సత్యనారాయణరెడ్డి, బాలకంబయ్య, రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

- ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లి వద్ద సోమవారం డివైడర్‌ను బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయాలపాలయ్యాడు. నంద్యాలకు చెందిన రవికుమార్ (38), రాజేశ్ ద్విచక్ర వాహనంపై పెరవలికి బయలుదేరారు. వెంగళాంపల్లి హైవే వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో రవికుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాజేశ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదంలో మృతి చెందిన రవికుమార్‌కు భార్య రాధమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ప్యాపిలి పోలీసులు తెలిపారు.

విత్తన ఎంపిక కీలకం

- ప్రారంభమైన ఖరీఫ్
- నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు
- చీడపీడలు దూరం
- కొనుగోలులో రసీదులు తప్పనిసరి
- నియోజకవర్గ స్థాయి ల్యాబ్‌లో నాణ్యతను పరిశీలించుకోవాలి

కర్నూలు (అగ్రికల్చర్)/కోవెలకుంట్ల: వరుణుడు ముందస్తుగా కరుణించడంతో ఖరీఫ్ సాగు జోరందుకుంది. ఆయా మండలాల పరిధిలో వరి, పత్తి, మిరప, కంది, మినుము, పెసర, ఉల్లి, ఆముదం, మొక్కజొన్న, వేరుశనగ, జొన్న, తదితర పంటల సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఆయా పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు విత్తన ఎంపిక, కొనుగోలులో మెలకువలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నకిలీ బెడద ఎక్కువగా ఉన్నందున విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలులో విధిగా బిల్లు తీసుకోవడం అత్యవసరం. విత్తనాలు, ఎరువులకు సంబంధించి అనుమానం వస్తే సంబంధిత నియోజకవర్గంలోని అగ్రి ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ల్లో ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చు.

విత్తన కొనుగోలు....

- వ్యవసాయ శాఖ నుంచి అనుమతి పొందిన అధీకృత డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో డీలర్ల వద్ద నుంచి తప్పని సరిగా బిల్లులు పొందాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనరాదు.
- గడువు దాటిన విత్తనాలను తీసుకోరాదు. బిల్లుపై విక్రయదారుడి పేరు,కేంద్రం, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబరు, రైతుపేరు, గ్రామం పేరు, రైతు, విక్రయదారుడి సంతకం, తేదీలు, రకం పేరు, బ్యాచ్ నెంబరు, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలి.
- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్, సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందా లేదా నిర్ధారించుకోవాలి.



నాణ్యమైన విత్తనాలు



విత్తనాల నాణ్యతను పరిశీలిస్తున్న పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి

- పంటకాలం పూర్తి అయ్యేవరకు బిల్లులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి.
- విక్రయదారుడు ఇచ్చే కర పత్రాల్లో పేర్కొన్న అంశాలను చదవాలి. మొలకెత్తే దశలో, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలి.
- విత్తనం కొనుగోలు చేసిన వెంటనే పరీక్షించాలి. మొలక శాతం సంతృప్తిగా ఉన్న వాటిని మాత్రమే ఎంపిక చేసుకోవాలి.

పురుగు మందుల కొనుగోలు సమయంలో..

- చీడ పీడలకు వినియోగించే క్రిమి సంహారక మందుల కొనుగోలు సమయంలో రైతులు అప్రత్తంగా ఉండాలి. వ్యవసాయ, ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన పురుగు మందులనే ఉపయోగించాలి.
- అవసరానికి మించి కొనుగోలు చేసిన, నిల్వ ఉంచిన పురుగు మందులను వాడరాదు. లైసెన్సు ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. పురుగు మందు డబ్బాలపై వజ్రాకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విష పూరితమైతే నీలం రంగు, స్వల్ప విష పూరితం అయితే ఆకు పచ్చరంగు గుర్తులు ఉంటాయి.
- పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడరాదు. వాడిన డబ్బాలు, సీసాలు, ధ్వంసం చేసి గుంతలో పూడ్చి పెట్టాలి. పురుగు మందుల వాడటానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు వినియోగించరాదు.

ఎరువుల కొనుగోలులో..

- లైసెన్సు ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. బిల్లులు, ఖాళీ సంచులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచాలి.
- మిషన్ కుట్టుతో ఉన్న ఎరువు సంచులు మాత్రమే వాడాలి. ఒక వేళ చేతి కుట్టు ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తి దారుడి పేరు ఖచ్చితంగా ఉండాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రసీదులో రైతు విధిగా సంతకం చేయాలి.
- ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహకారంతో ఎరువులను పరీక్షకు పంపాలి. చిల్లులు పడిన, చిరిగిన ఎరువుల బస్తాలు కొనుగోలు చేయరాదు. అన్య పదార్థాలు కనిపిస్తే ఆ ఎరువును కల్తీగా గుర్తించాలి.

అనుకూలంగా మారిన వర్షాలు..

ఈ ఏడాది ఖరీఫ్ ముందే రైతులు పొలాలను దుక్కి దున్ని విత్తనానికి సిద్ధం చేసుకున్నారు. రుతుపవనాల ప్రభావంతో సీజన్ ప్రారంభం నుంచే వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలు అనుకూలంగా మారటంతో ఖరీఫ్ అన్ని విధాలా కలిసి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ ఇప్పటికే రసాయన ఎరువులు, విత్తనాలను సరఫరా చేసింది. నంద్యాల జిల్లాలోని ఆయా మండలాలకు సంబంధించి 7,037 క్వింటాళ్ల జీలుగ విత్తనాలకు ప్రతిపాదనలు పంపగా మొదటి విడత, 3,756 క్వింటాళ్ల విత్తనాలు మంజూరయ్యాయి. 50 శాతం సబ్సిడీతో క్వింటా జీలుగ విత్తనాలను రూ.4.400, పిల్లిపెసర విత్తనాలను రూ.6,700 ప్రకారం రైతులకు అందజేస్తున్నారు. జిల్లాలోని డోన్ మండలానికి 1,354 క్వింటాళ్లు, ప్యాపిలికి 746 క్వింటాళ్లు, బేతంచెర్ల మండలానికి 380 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను కేటాయించింది. అలాగే జిల్లాకు 48,039 మెట్రిక్ టన్నుల యూరియా, 30,115 మెట్రిక్ టన్నుల డీఏపీ, 3,246 టన్నుల ఎంఓపీ, 86,185 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 2,805 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ ఎరువులను కేటాయించింది.

కర్నూలు జిల్లాకు కేటాయించిన సబ్సిడీ విత్తనాల వివరాలు క్వింటాళ్లలో	
వేరుశనగ	13,929
కందులు	1,000
మినుములు	20
పెసలు	2
కొర్రలు	45
దయంచ	197
పిల్లిపెసర	25
మొత్తం	15,218

కర్నూలు జిల్లాకు కేటాయించిన ఎరువుల వివరాలు టన్నుల్లో	
యూరియా	54,432
డీఏపీ	16,223
ఎంఓపీ	1,485
కాంప్లెక్స్	1,16,571
ఎస్ఎస్‌పీ	1,689
మొత్తం	1,90,400

తగిన జాగ్రత్తలు అత్యవసరం

ఎరువులు, విత్తనాలు,పురుగు మందుల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎరువులు, విత్తనాలకు సంబంధించి ఏదైనా అనుమానం వస్తే నియోజకవర్గ స్థాయిలోని ల్యాబ్‌లో నాణ్యతను పరిశీలించుకోవచ్చు. విత్తనాలు, ఎరువులు ఎక్కుడబడితే అక్కడ కొనుగోలు చేయరాదు. ఇలా చేస్తే మోసపోయేందుకు అవకాశం ఉంటుంది. లైసెన్స్ కలిగిన డీలరు వద్దనే కొనుగోలు చేయాలి. అలాగే కొనుగోలుకు సంబంధించిన బిల్లు తీసుకోవాలి. లూజు విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోను కొనుగోలు చేయవద్దు. రైతులు మోసపోకుండా వ్యవసాయ శాఖ అన్ని చర్యలు తీసుకుంటోంది. – పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

ఆర్‌యూకు రూసా ప్రాజెక్ట్ మంజూరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయానికి రూసా ప్రాజెక్ట్ మంజూరైనట్లు వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ వెల్లడించారు. వర్సిటీలోని వివిధ విభాగాల్లో ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఆర్.భరత్ కుమార్, డాక్టర్ పి.వెంకటసుందరానంద్, డాక్టర్ సి.విశ్వనాథ్ రెడ్డిలకు రూసా ప్రాజెక్టు మంజూరైనట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రూసా ప్రాజెక్టు డైరెక్టర్ ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేశారన్నారు. వర్సిటీ ఆచార్యులకు పరిశోధనా ప్రాజెక్టులు మంజూరు కావడం పట్ల వైస్ ఛాన్సలర్ ఆచార్య బి.సుధీర్ ప్రేమ్‌కుమార్, రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.అంకన్న శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ప్రాజెక్ట్ మంజూరు లేఖను సంబంధిత



రూసా ప్రాజెక్ట్ మంజూరు లేఖను ఆచార్యులకు అందజేస్తున్న వర్సిటీ వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్

ఆచార్యులకు వీసీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది జూన్ 1 నుంచి మే 31వ తేదీ 2026 మధ్య యూనివర్సిటీలోని బోటని, మేథమేటిక్స్, మేనేజ్‌మెంట్ విభాగాల్లో చేపట్టే ఈ ప్రాజెక్టులకు మొత్తం రూ.19 లక్షలను కేటాయించారన్నారు. తొలి విడతగా రూ.8,36,000 విడుదల చేశారన్నారు. 'సాఫ్ట్‌వేర్ టూల్స్ ఫర్ క్రిప్ట్ ఎనాలసిస్ బేస్డ్ ఆన్ ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్ టెక్నిక్స్' అనే అంశంపై ఆచార్య పి.వి.సుందరానంద్‌కు రూ.10 లక్షలు, 'ఇంపాక్ట్ ఆఫ్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ ఆఫ్ పవర్టీ అలివియేషన్ అండ్ మాడరేటింగ్ ఎఫెక్ట్స్ ఆఫ్ మైక్రో ఫైనాన్స్ – ఎ స్టడీ విత్ రిఫరెన్స్ టు బ్యాక్‌వర్డ్ విలేజెస్ ఇన్ రాయలసీమ రీజియన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై ఆచార్య సి.విశ్వనాథరెడ్డికి రూ.4 లక్షలు , 'ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ హెర్బల్ గార్డెన్ ఎట్ రాయలసీమ యూనివర్సిటీ క్యాంపస్ కర్నూలు టు సర్వ్ యాస్ జెర్మ్‌ప్లాస్మ్ రిసోర్స్ అండ్ సస్టెయినబుల్ యుటిలైజేషన్' అనే అంశంపై ఆచార్య భరత్‌కుమార్‌కు రూ.5 లక్షలు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు.

పత్తిలో అధిక సాంద్రత పద్ధతి

- కేవీకేల పర్యవేక్షణలో ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటు

కర్నూలు(అగ్రికల్చర్): పత్తిలో అధిక సాంద్రత పద్ధతిపై కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నారు. నాగ్‌పూర్‌లోని కేంద్రీయ పత్తి పరిశోధన స్థానం సహకారంతో నంద్యాల జిల్లా యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, కర్నూలు జిల్లా బనవాసి కృషి విజ్ఞాన కేంద్రాల ఆధ్వర్యంలో వర్షాధారం కింద అధిక సాంద్రత పద్ధతి(హైడెన్సిటీ)లో పత్తి సాగు చేపట్టనున్నారు. ఈ పద్ధతికి రాశి ప్రైవేట్ హైబ్రీడ్‌కు చెందిన ఆర్‌సీహెచ్–971 రకాన్ని మాత్రమే వినియోగించాలి. ఒక్కో కేవీకే పరిధిలో 50 ఎకరాల్లో ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తారు. ఎంపిక చేసిన రైతులకు ఆర్‌సీహెచ్–971 రకం బీటీ పత్తి విత్తన ప్యాకెట్లను 100 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తారు. ఈ పద్ధతిలో ఎకరాలకు 450 గ్రాముల ప్యాకెట్లు 5 నుంచి 6 వరకు అవసరమవుతాయి. ఒక రైతుకు ఒక ఎకరా మాత్రమే అవకాశం ఇస్తారు. ఈ పద్ధతిలో సాలుకు, సాలుకు మధ్య 3 అడుగులు, మొక్కకు, మొక్కకు మధ్య అర్ధ అడుగు నుంచి అడుగు వరకు మాత్రమే దూరం ఉండాలి. మొక్కలు అన్ని సమానంగా పెరిగే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. మొక్కల సంఖ్య పెరుగుతుండటం వల్ల దిగుబడులు మామూలు కంటే 20–30 శాతం వరకు ఎక్కువగా అవకాశం ఉంది. ఈ ప్రదర్శన క్షేత్రాలు ఆయా కృషి విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తల పర్యవేక్షణలో సాగవుతాయి. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం రైతులకు బాగా కలసి వస్తుందని యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సుధాకర్ తెలిపారు. నందికొట్కూరు సబ్ డివిజన్‌లో పత్తి ప్రదర్శన క్షేత్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

ఓర్వకల్లు: మండల పరిధిలోని హుసేనాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంగన్నపై టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాలు.. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి విజయం సాధించడంతో ముందుజాగ్రత్తగా కర్నూలులోనే నివాసం ఉంటున్నాడు. వ్యక్తిగత పని మీద ఆదివారం రాత్రి స్వగ్రామానికి చేరుకున్నాడు. గమనించిన టీడీపీ కార్యకర్తలు దాడిచేసేందుకు కాపుకాశారు. ఈక్రమంలో సోమవారం సాయంత్రం వెంగన్న కారులో కర్నూలుకు బయలుదేరాడు. మార్గమధ్యంలో టైర్‌కు గాలీ పట్టించుకుంటుండగా టీడీపీ కార్యకర్తలు గువ్వ రవికుమార్, బోయ రాము తదితరులు దాడి చేశారు. అంతుచూస్తామంటూ పరుష పదజాలంతో దుర్భాషలాడి, కారు అద్దాలను పగులగొట్టి, కారులో ఉన్న వెంగన్నపై భౌతి కదాడులకు పాల్పడ్డారు. తల, ముఖము భాగాలపై మూగదెబ్బలు తగిలాయి. వారి నుంచి చాకచక్యంగా తప్పించుకొని పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించాడు. పోలీసులు వెంగన్నను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.



టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వెంగన్న

దాడులకు పాల్పడటం పద్ధతికాదు

టీడీపీ కార్యకర్తల దాడిని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఖండించారు. సోమవారం ఆయన మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆస్పత్రికి చేరుకుని వెంగన్నను పరామర్శించారు. ఈ సందర్భంగా రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ , టీడీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడటం పద్ధతి కాదన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలు దెబ్బతినడమేగాక, ఆర్థికంగా నష్టపోతారని హితవు పలికారు. పోలీసులు గ్రామాల్లో బందోబస్తును పెంచాలని కోరారు.

సిల్వర్ సెట్ గడువు పెంపు

కర్నూలు సిటీ: తెలుగు రాష్ట్రాల్లో ఎంతో గుర్తింపు కలిగిన సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రవేశాలకు నిర్వహించే సిల్వర్‌సెట్ గడువు పొడిగించినట్లు క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్ తెలిపారు. సోమవారం స్థానిక క్లస్టర్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీలో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్‌లు, సైంటిస్టులతో పాటు, ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించారన్నారు. అలాంటి చరిత్ర కలిగిన కాలేజీలో ప్రవేశాల కోసం ఏటా నిర్వహిస్తున్న సిల్వర్ సెట్–2024 గడువు ఈ నెల 23వ తేది వరకు పొడిగించామన్నారు. వచ్చే నెల 7న ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తామన్నారు. కాలేజీలో అత్యుత్తమ బోధనతో పాటు బాలురు, బాలికలకు వేరువేరుగా హాస్టల్ సదుపాయం ఉందన్నారు. విలేకరుల సమావేశంలో క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్, సిల్వర్ సెట్ కన్వీనర్ ఆచార్య శ్రీనివాసులు, ప్రిన్సిపల్ డాక్టర్ వీవీఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి, అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ మహమ్మద్ వాయిజ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డైరెక్టర్ డాక్టర్ సునీల్‌కుమార్ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ దలవాయి శ్రీనివాసులు, డాక్టర్ ఎల్లా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్

నందుల కోటలో కలియుగదైవం

- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా బిలకలగూడూరు బాలాజీ ఆలయం
- 2.5 ఎకరాల్లో బ్లాక్ లైమ్ స్టోన్‌తో ఆలయ నిర్మాణం
- భక్తులకు సకల సదుపాయాలు కల్పిస్తున్న జిందాల్ యాజమాన్యం

నంది ఆలయాల పేరుతో ప్రసిద్ధి చెందిన నంద్యాల జిల్లాలో శ్రీశైలం, మహానంది, యాగంటి తదితర శైవక్షేత్రాలతో పాటు ఆహోబిలం, రంగాపురం మద్దిలేటి స్వామి లాంటి వైష్ణవ పుణ్య క్షేత్రాలు సైతం దినదినాభివృద్ధి చెందుతున్నాయి. వీటితో పాటు గడివేముల మండలం బిలకలగూడూరు గ్రామ సమీపంలో కలియుగ దైవం వెంకటేశ్వరుడి బాలాజీ ఆలయం ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. ఒకప్పుడు రాళ్ల రప్పలతో ఉన్న ప్రాంతంలో 10వ శతాబ్దపు తిరుమల తరహాలో జిందాల్ కంపెనీ నిర్మించిన బాలాజీ ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధి చెందుతోంది. అచ్చం తిరుమలలాగే వెంకటేశ్వరుడి వైభవం, వరాహస్వామి విశిష్టత, పుష్కరిణి సైతం సుందరంగా తీర్చిదిద్దారు.



భక్తులకు దర్శనమిస్తున్న వెంకటేశ్వరస్వామి



బాలాజీ ఆలయం



ఆలయ ప్రాంగణంలో వరాహస్వామి

గడివేముల: బాలాజీ ఆలయాన్ని జెఎస్‌డబ్ల్యూ సిమెంట్ కంపెనీ సహకారంతో బ్లాక్ లైమ్‌స్టోన్ వినియోగించి 2.5 ఎకరాల స్థలంలో నిర్మించారు. బాలాజీ ఆలయం నిర్మాణ శైలి మహోన్నతమైన భారతీయ దేవాలయ శిల్పకళాచాతుర్యతను ప్రదర్శించడంతో పాటు ఈ 10వ శతాబ్దం నుంచి ఉన్న తిరుపతిలోని బాలాజీ ఆలయం నమూనాను పోలి ఉండేలా తీర్చిదిద్దారు. బాలాజీ ఆలయంలో వెంకటేశ్వరస్వామి, వరహాస్వామి ప్రతిమలు బ్లాక్‌లైమ్‌స్టోన్ జిగ్గొరూట్స్‌లా ఉంటాయి. బాలాజీ దేవాలయ ప్రాజెక్ట్‌కు అనూశ్రీ జిందాల్ నేతృత్వం వహించారు. భారతీయ ఆర్కిటెక్ట్, సమీప్ పదోరా అండ్ అసోసియేట్స్ సమీప్ పదోరా దీనికి ముఖ్య ఆర్కిటెక్ట్‌గా పనిచేశారు. జెఎస్‌డబ్ల్యూ సీఎస్ఆర్ నిధులు దాదాపు రూ.5 కోట్లతో నిర్మించిన ఈ దేవాలయాన్ని నంద్యాల ప్రజలకు అంకితం చేసింది. దేవాలయ ప్రాజెక్ట్ ద్వారా జెఎస్‌డబ్ల్యూ సిమెంట్ లక్ష్యం.. దేవాలయానికి సంబంధించి ప్రజల సాంస్కృతిక అంచనాలను అందుకోవడం, ఎన్నో సంవత్సరాలుగా నీటి వనరుల లభ్యత తక్కువ కావడంతో ఎడారిలా మారుతున్న ప్రాంతంలో దానిని పునరుద్ధరించడం జరిగింది.

దర్శన వేళలు

బాలాజీ ఆలయం ప్రతి రోజు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరచి ఉంటుంది. ఎటువంటి టికెట్ లేకుండానే స్వామి వారిని దర్శించుకోవచ్చు. ఏటా వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చేల భక్తుల వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు.

ఆలయానికి చేరుకునేది ఇలా..

నంద్యాల నుంచి బిలకలగూడూరు బాలాజీ టెంపుల్‌కు 30 కిలో మీటర్ల దూరం ఉంటుంది. కర్నూలు నుంచి నందికొట్కూరు మీదుగా గడివేముల వయా బాలాజీ దేవాలయానికి చేరుకోవడానికి 65 కిలోమీటర్ల దూరం ఉంటుంది. బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటుంది.



పచ్చని అందాలతో దర్శనమిస్తున్న ఆలయ ప్రాంగణం